✹ అవసరాల రామకృష్ణారావు

# విదేశీ నేపథ్యంలో తెలుగు కథ

## ఆధునిక జీవితంలో వ్యక్తిత్వ సాధన కోసం వెలుగు చూపే కథాకోశం

వక్తల వల్లగానీ, ప్రవక్తల వల్లగానీ మనదేశ స్త్రీ జీవనశైలి ఉద్ధరింపబడిన దాఖలాలు గతంలో కనిపించవు. అవి 'ఉత్తరింపబడిన' తార్కాణాలు మాత్రం వలువలూడిన మన సినిమాల్లోనూ, విలువల జోలికి పోని మన టీవీ సీరియల్స్‌లోనూ ప్రస్తుతం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా, ప్రచార ధోరణిలోని అపచార సరళిని మాత్రం కాదనలేం. 'పాపం పాఠకులు అమాయకులు. నిద్రపోవడం వారి సహజ ధర్మం. రెండు మంచి ముక్కలు ఎక్కించి వారిని జోకొట్టడం మన బాధ్యత,' అని సాహితీ మేధావులు కంకణం కట్టుకున్నంత కాలం ఏ ప్రక్రియ అయినా నేలబారు దాటదు. నీతిబోధ అనే ఈతిబాధకు పాఠకుడిని గురి చెయ్యనిదే మంచి రచన. అందుకనే *గట్టుతెగిన చెరువు* అనే సంపుటిలోనివి గొప్ప కథలు.

ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఎలా మృగ్యమైపోతోంది? ఇద్దరే ఉన్న యువ దంపతులైనా సమాన బాధ్యతలు వహించి సంసార రథాన్ని సవ్యంగా నడుపుతున్నారా అంటే అదీ అనుమానమే. యువకులే కుటుంబ పెత్తనాన్ని చేపట్టి నిరంకుశులుగా ప్రవర్తిస్తున్నారు. దాంతో పరస్పర గౌరవం గానీ, వ్యక్తిగతంగా ఎదిగే అవకాశంగానీ యువతులకు లభించడంలేదు. ఇది చాలక ముక్కూ మొహం తెలియనివారికి కూతుళ్ళనిచ్చి పెళ్ళి చేసి చేతులు కడుక్కునే తల్లిదండ్రుల సంఖ్య నానాటికీ ఎక్కువై సమస్యని మరింత జటిలం చేస్తోంది. మానవ సంబంధాల్ని ఓ ఊపు ఊపుతున్న ఈ నేపథ్యంలోంచి పుట్టినవే చాలా వరకు ఈ సంపుటిలో కథలు. అణచివేతకు గురైన ఈ కథానాయికలు ఎదురు తిరిగి తమ సమస్యల్ని తామే పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తారు గనుకనే ఇవి పాఠకుల ఆలోచనా ముద్రకు నోచుకునే కథలు.

ఏ కథైనా తనకుతానుగా చొరబడి ముగింపు ఇవ్వకపోవడం అలా ఉంచి, తన పాత్రల చేతనైనా ఇదమిత్థమని సరిపెట్టించనివ్వడు కథకుడు. నిత్య ప్రవాహశీలి అయిన ఈ జీవితంలో ప్రగతి గతి అనేది అక్కడితో ఆగిపోయే సంగతి కాదని ఆయన ఉద్దేశం అయియుండాలి. *దూరపుకొండలు* అనే కథలో 'కూతుర్ని దూరం చేసుకోవటం కష్టమా, నల్లవాణ్ణి అల్లుడిగా స్వీకరించడం కష్టమా?' ఆలోచించసాగాడు ఆచారి అని ముగించినా, *మీకు మీరే* అనే కథలో 'దానిష్టం ఇష్టముంటే చేసుకుంటతి, లేకపోతే ఊరుకుంటతి,' అని ఎంకమ్మతో ముక్తాయింపు పలికించినా, 'ఇలాగే కలుసుకుంటూ ఉంటే కొన్నాళ్ళలో ఆమెను పెళ్ళికి ఒప్పించగలననే నమ్మకం కలిగింది నాకు,' అని నెరేటర్‌తో మొదటి కథ ఆఖరిమాటగా చెప్పించినా కథకుడి ప్రత్యేక శైలి స్పష్టమవుతూ ఉంటుంది.

ఇక *రెండువారాల సెలవు* అనే కథ మరింతగా మనసుకు పట్టే ఇతివృత్తం. ఇందులో చికాగో నుంచి సుమతి వాళ్ళ నాన్నగారికి రాసిన ఉత్తరం ముఖ్యాంశం. భర్త వైఖరి నచ్చని సుమతి వివాహాన్ని రద్దు చేసుకుని లా చదవాలని భావిస్తుంది. కాపురం లేకపోయినా శాంతంగా, సుఖంగా ఉన్నానంటూ ఉత్తరం ముగిస్తుంది సుమతి. ఈ కథలోని మెరుపు అంతా తల్లి రాసిన జవాబులోనే ఉంది. 'ఎంత పని చేశావే దౌర్భాగ్యురాలా, వంశానికి మచ్చ తెచ్చావు కదే,' అనే పదాలు మచ్చుకైనా కనబడవు. నా కూతురు ఎలాంటి తప్పు చెయ్యదు అనుకునే తల్లులుంటే పిల్లలెలా తయారవుతారు మరి!

ఎలాంటి సాంఘిక సమస్యను మన ముందుంచినా సురుచిర హాస్యమూ, సునిశిత వ్యంగ్యమూ కలిపి వడ్డిస్తే పాఠకులం మరింత ఆసక్తిగా చదువుతాం. ఈ కథకుడి శైలి అలాంటిదే అని ఈయన కనిపెట్టిన తెలుగు పదం *అవచారం* రుజువు చేస్తుంది. అవకాశం కోసం ఏర్పడ్డ ఆచారమే అవచారం అంటే ఎలా కాదనగలం? ఆడపిల్లల పురుళ్ళ కోసం అమెరికా చేరే అమ్మల చాకిరీ అలాంటిదే. పెద్దావిడ ప్రేమతో వస్తే రావచ్చుగానీ, భర్త కొన్నాళ్ళు సెలవు పెట్టి ఇంట్లో ఎందుకు సహాయం చెయ్యకూడదు అనే ప్రశ్నకు జవాబు దొరకదు. మంచి కథలు అచ్చవడమే అరుదైన విషయం. వాటిని ముచ్చటైన కథా కదంబంగా గుదిగుచ్చడం మరో మహత్కార్యం.

అచ్చుతప్పన్నది లేకపోగా, ఆ'చంద్రా'ర్కం నిలిచిపోయే బొమ్మలు కూడా. ఇంతటి శ్రద్ధతో దీన్ని తీర్చిదిద్దిన డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్, బ్లూమ్‌ఫీల్డ్ హిల్స్, మిచిగన్ వారి మాతృభాషాభిమానానికి మాత్రం ముచ్చట పడకుండా ఎలా ఉండగలం.

*గట్టు తెగిన చెరువు*, **రచన:** *ఆరి సీతారామయ్య*

***పేజీలు: 117. వెల: రూ. 40.*** **$6.95**